సాక్షి
సంగారెడ్డి
మంగళవారం । 9 । జూలై । 2024



సంగారెడ్డి జిల్లా కంది శివారులో మేఘావృతమైన ఆకాశం

దోబూచులాడుతున్న మేఘాలు

మేఘాలు దోబూచులాడుతున్నాయి. వారం రోజులుగా సాయంత్రం పూట ఆకాశం మేఘావృతమవుతుంది. ఇక వర్షం కుమ్మేస్తుందేమో అన్నట్లుగా మబ్బులన్నీ నల్లగా కమ్ముకుంటున్నాయి. తీరా చూస్తే వాన జాడమాత్రం కనిపించడం లేదు. వరుణుడా కరుణించవా అంటూ రైతన్నలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు. ఇప్పటికే పత్తి మొక్కలు ఎండిపోతాయేమోనన్న ఆందోళన వ్యక్తమవుతుంది.

సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

న్యూస్‌రీల్

సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్‌గా గిరిధర్‌రెడ్డి



గిరిధర్‌రెడ్డి

జహీరాబాద్: మాజీ ఎంపీపీ ఎస్.గిరిధర్‌రెడ్డికి సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ పదవి దక్కింది. సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రస్థాయిలో 24 మందికి కార్పొరేషన్ చైర్మన్ పదవులను ప్రకటించారు. అందులో గిరిధర్‌రెడ్డికి చోటు దక్కింది. సొసైటీ ఫర్ ఎంప్లాయ్‌మెంట్ ప్రమోషన్ అండ్ ట్రైనింగ్ ఇన్ ట్విన్ సిటీస్(సెట్విన్) చైర్మన్‌గా నియమించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయిన సమయంలో జహీరాబాద్ నియోజకవర్గంలో గిరిధర్‌రెడ్డి పార్టీని బతికించి, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తెచ్చారు. తర్వాత మండలంలోని చిరాగ్‌పల్లికి చెందిన ఆయన స్వగ్రామంలో ఎంపీటీసీ సభ్యుడిగా గెలుపొందారు. అనంతరం జహీరాబాద్ ఎంపీపీ అధ్యక్షుడిగా గెలువడంతో పాటు జహీరాబాద్, కోహీర్, ఝరాసంగం జెడ్పీటీసీ స్థానాలను, మొగుడంపల్లి, కోహీర్, ఝరాసంగం ఎంపీపీ స్థానాలు కాంగ్రెస్‌కు దక్కాయి. మాజీ మంత్రి గీతారెడ్డి వయసు పైబడిన కారణంగా క్రియాశీలక రాజకీయాలకు దూరంగా ఉండడంతో జహీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ బాధ్యతలను గిరిధర్‌రెడ్డి మోసి పార్టీని నిలబెట్టారు. దీంతో ఆయన పార్టీకి అందించిన సేవలను గుర్తించి ఈ మేరకు కార్పొరేషన్ చైర్మన్ పదవిని అధిష్టానవర్గం కేటాయించింది.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



నారాయణఖేడ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కుమార్

నారాయణఖేడ్: నిబంధనలు పాటించని, అనుమతి లేని ప్రైవేటు పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని అఖిలభారత ప్రజాతంత్ర విద్యార్థి సమాఖ్య ఉమ్మడి మెదక్ జిల్లా కార్యదర్శి తెంకటి కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం నారాయణఖేడ్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో పలు ప్రైవేటు పాఠశాలలు నిబంధనలు పాటించకపోగా అనుమతులు లేని పాఠశాలలు అనేకం కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. భవనాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని, దీంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారని చెప్పారు. పాఠశాలలకు సమీపాల్లో వాటి యజమానులే షట్టర్లు అద్దెకు తీసుకుని పాఠ్య, నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులు, విద్యాసామగ్రి విక్రయాలు కొనసాగిస్తున్నారని చెప్పారు. కొన్ని పాఠశాలలు అనుమతులు లేకుండానే హాస్టళ్లను నడుపుతున్నాయన్నారు. అలాంటి పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ డివిజన్ నాయకులు రమేష్, ప్రవీణ్, జాన్ పాల్గొన్నారు.

రాయికోడ్ ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలి

జహీరాబాద్ టౌన్: రాయికోడ్ గురుకులంలో చోటు చేసుకున్న సంఘటనపై విచారణ జరిపించి ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు రాజేష్ డిమాండ్ చేశారు. జహీరాబాద్ ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థిని ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురుకుల భవనంపై నుంచి దూకి గాయపడిన విద్యార్థి మల్లేశ్వరీ వైద్య ఖర్చులు యాజమాన్యం భరించాలని కోరారు. విద్యార్థి వైద్యం పట్ల నిర్లక్ష్యం చేస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఆయన వెంట నాయకులు హరీశ్, అతీక్, పృథ్వీరాజ్, మహేష్ ఉన్నారు.

వైష్ణవికి గోల్డ్‌మెడల్

సదాశివపేట (సంగారెడ్డి): సదాశివపేటకు చెందిన నాగారం వైష్ణవి ఎంటెక్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. 2022–23 విద్యాసంవత్సరంలో హైదరాబాద్‌లోని సీవీఆర్ కళాశాలలో ఎంటెక్ విద్యనభ్యసించింది. యూనివర్సిటీ టాపర్‌గా నిలిచిన ఆమెను.. ఆదివారం కళాశాల వైస్ చాన్సలర్ అధ్యాపక బృందం సత్కరించి గోల్డ్ మెడల్ అందజేసింది. వైష్ణవి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, పట్టా అందుకోవడం తమ కళాశాలకు గర్వకారణమని సీవీఆర్ కళాశాల యాజమాన్యం సంతోషం వ్యక్తం చేసింది. కాగా తమ కూతురు గోల్డ్‌మెడల సాధించడం పట్ల వైష్ణవి తల్లిదండ్రులు నర్సింలు, మాధవి తెగసంబరపడిపోతున్నారు. రాజు, వైష్ణవి, జగదీశ్వర్, సువర్ణ, హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.



గోల్డ్‌మెడల్ పట్టా అందుకుంటున్న వైష్ణవి

ఇంటింటా ఇన్నోవేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ క్రాంతి

నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదిక కావాలి
- కలెక్టర్ క్రాంతి పిలుపు
- ప్రజలకు అవగాహన కల్పించాలి
- ఇన్నోవేషన్ పోస్టర్ ఆవిష్కరణ

సంగారెడ్డి టౌన్: నూతన ఆవిష్కరణలకు సంగారెడ్డి జిల్లా వేదిక కావాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా మీ ఆవిష్కరణ ప్రదర్శించే అవకాశం ఉంటుందని చెప్పారు. ఆయా శాఖల అధికారులు పాఠశాలలతో పాటు గ్రామాల్లో ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని కోరారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలతో తమ ప్రతిభకు పదును పెట్టే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదని, ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా పలు ఆవిష్కరణలను ప్రదర్శిస్తారన్నారు. ఆసక్తి గల వారు ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు గల రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, 100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబర్ 9100678543కు పంపాలని కలెక్టర్ కోరారు. పేరు, వయస్సు, ఫొటో, వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరు వివరాలతో ఆగస్టు 3వ తేదీలోపు పంపించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ పద్మజారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించాలి

ప్రతి శుక్రవారం మున్సిపాలిటీ, గ్రామాలలో డ్రై డే నిర్వహించాలని సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ క్రాంతి అన్నారు. జిల్లాస్థాయి బదిలీల ప్రక్రియ ఈనెల 20వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. జిల్లా ప్రజా పరిషత్ పదవీకాలం ముగియడంతో మండలాలకు ప్రత్యేక అధికారులను నియమించామని, ప్రత్యేక అధికారులు రెగ్యులర్గా విధులకు హాజరుకావాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహించాలని డెంగ్యూ కేసులు నమోదైన ప్రాంతాలపై ప్రత్యేక నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గ్రామపంచాయతీ సిబ్బందికి జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

త్వరితగతిన పరిష్కరించండి
ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరణ

సంగారెడ్డి టౌన్: ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ వల్లూరి క్రాంతి అన్నారు. సోమవారం కలెక్టరేట్లో ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో భాగంగా పలువురు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. 61 ఏళ్ల పైబడిన వీఆర్ఏ వారసులకు వారసత్వ నియామకాలు తొందరగా చేయాలని విధుల్లోకి తీసుకునే విధంగా చూడాలని వీఆర్ఏలు ఫిర్యాదు చేశారు. అలాగే, నాల్కల్ మండలం రేజింతల్ గ్రామానికి చెందిన ప్రసాద్ పింఛన్ రావడం లేదని అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గుమ్మడిదల గ్రామానికి చెందిన పెంటయ్య ఫిర్యాదు చేస్తూ.. తనకున్న నాలుగు ఎకరాల భూమి ధరణిలో ఎక్కించి పట్టా పాస్‌బుక్ అందించేలా చూడాలని కోరారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చూడాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్‌ఓ పద్మజ, అధికారులు పాల్గొన్నారు.

ఆ నలుగురు..

జిల్లాలో ఒకే బ్యాచ్‌కు చెందిన ఉన్నతాధికారులు • కీలక శాఖలకు ప్రాతినిధ్యం

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: జిల్లాలోని నాలుగు కీలక శాఖలకు ఒకే బ్యాచ్‌కు చెందిన ఉన్నతాధికారులే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గ్రూప్–1 2017 బ్యాచ్‌కు చెందిన నలుగురు యువ ఉన్నతాధికారులు జిల్లాలో పనిచేస్తున్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఆర్‌డీ మాధురి, సంగారెడ్డి జిల్లా సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ భరత్‌రెడ్డి, సోషల్‌వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ అఖిలేష్‌రెడ్డి, సంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ అధికారి (సూపరింటెండెంట్) నవీన్‌చంద్ర ఒకే బ్యాచ్‌కు చెందినవారు. గ్రూప్–1 అధికారులుగా నియమితులైన సదరు అధికారులు వివిధ జిల్లాల్లో పోస్టింగ్‌లు పొంది.. బదిలీల్లో భాగంగా సంగారెడ్డి జిల్లాకు వచ్చారు. గ్రూప్–1 పోస్టుల భర్తీ అప్పటి ప్రభుత్వం 2011లో నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి మెయిన్స్ పరీక్ష, ఇంటర్వ్యూలు 2012లో జరిగాయి. కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో ఉద్యోగాల భర్తీలో జాప్యం జరిగింది. న్యాయస్థానం ఆదేశాల మేరకు తిరిగి 2016 లో తిరిగిన మెయిన్స్ పరీక్షతో పాటు, ఇంటర్వ్యూలు నిర్వహించారు. వీటిలో ఎంపికైన అభ్యర్థులకు 2017లో పోస్టింగ్‌లు ఇచ్చారు. అందులో జిల్లాలో పనిచేస్తున్న వారు ఈ నలుగురు ఉన్నతాధికారులు ఉన్నారు.

అదనపు కలెక్టర్ మాధురి



జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేస్తున్న ఆర్‌డీ మాధురి గ్రూప్–1లో రాష్ట్రంలోనే మొదటి ర్యాంకు సాధించారు. ఆర్డీఓగా ఎంపికైన మాధురి.. పదోన్నతిపై అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు జరిగిన బదిలీల్లో భాగంగా అదనపు కలెక్టర్‌గా నియమితులయ్యారు.

జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్‌చంద్ర



నవీన్‌చంద్ర జిల్లా ఎక్సైజ్ అధికారిగా ఇటీవల జిల్లాకు బదిలీపై వచ్చారు. నిజామాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా పనిచేసిన ఆయన తర్వాత వికారాబాద్‌లో పనిచేశారు. అక్కడి నుంచి జిల్లా ఎక్సైజ్ అధికారిగా నియమితులయ్యారు. నవీన్‌చంద్ర గ్రూప్–1లో 23వ ర్యాంక్ సాధించారు.

సెంట్రల్ జైలు సూపరింటెండెంట్..



భరత్‌రెడ్డి

కందిలో ఉన్న సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ భరత్‌రెడ్డి కూడా 2017 గ్రూప్–1 బ్యాచ్‌కు చెందిన వారే. 2022లో ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు. సుమారు రెండేళ్లుగా ఆయన ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్నారు.

సోషల్ వెల్ఫేర్ డీడీ అఖిలేష్‌రెడ్డి



అఖిలేష్‌రెడ్డి

సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్‌గా అఖిలేష్ రెడ్డి పనిచేస్తున్నారు. గ్రూప్–1 అధికారిగా నియమితులు కాక ముందు ఆయన సెంట్రల్ ఇంటెలిజెన్స్ విభాగంలో గుజరాత్‌లో పనిచేసేవారు. ఆ శాఖలో జాయింట్ ఇన్‌చార్జి బాధ్యతలు కూడా నిర్వర్తిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికే సెక్యూరిటీ కౌన్సిల్

ఎస్పీ రూపేష్

సంగారెడ్డి: సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ మెంబర్స్‌తో ఎస్పీ రూపేష్ సోమవారం సమావేశం నిర్వహించారు. పరిశ్రమలు, మహిళా ఉద్యోగుల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ లాంటి వివిధ రకాల సమస్యల పరిష్కారం కోసమే సొసైటీ ఫర్ సంగారెడ్డి సెక్యూరిటీ కౌన్సిల్ ఏర్పాటు చేశామని చెప్పారు. ఈ కౌన్సిల్‌లో జిల్లాలోని పరిశ్రమలు, ఇంజనీరింగ్, మెడికల్ విద్యాసంస్థల యాజమాన్యాలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమలలో చోటు చేసుకుంటున్న వివిధ రకాల ప్రమాదాలు అలాగే పరిశ్రమలు, విద్యా సంస్థలలో ఉండవలసిన భద్రతా చర్యలపై అవగాహన కల్పించారు. పారిశ్రామిక వేత్తలు పెట్టుబడులు పెట్టాలన్నా, కొత్త పరిశ్రమలు స్థాపించాలన్నా సరైన భద్రత, రక్షణ ఉందనే నమ్మకాన్ని వారిలో కలిగించాలన్నారు. అలాగే ట్రాఫిక్ రద్దీని నియంత్రించడానికి ఈ సొసైటీ ద్వారా ట్రాఫిక్ మార్షల్స్‌ను నియమించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎ.సంజీవరావ్, ఎస్ఎస్ఎస్‌సీ జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ, ట్రెజరర్ యం.రమణారెడ్డి, రంజిత్ కిరణ్, కె.రమేశ్, వెంకటేశ్వరరావ్, ఆనంద్‌రావ్, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, పటాన్ చెర్వు డీఎస్పీ రవీందర్ రెడ్డి, నారాయణ్ ఖేడ్ డీఎస్పీ వెంకట్, ఇన్‌స్పెక్టర్‌లు రమేశ్, నవీన్, లాలూ నాయక్, సుమన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ రూపేష్

ఏసీబీ వలలో హవేళిఘణాపూర్ ఎస్‌ఐ

మధ్యవర్తి ద్వారా లంచం తీసుకుంటుండగా పట్టివేత



పట్టుబడిన ఎస్‌ఐ ఆనంద్ గౌడ్, మధ్యవర్తి మస్తాన్

హవేళిఘణాపూర్: ఇసుకను అక్రమంగా తరలిస్తూ పట్టుబడిన ఓ టిప్పర్‌ను వదిలిపెట్టేందుకు మధ్యవర్తి ద్వారా రూ.20వేల లంచం తీసుకుంటుండగా స్థానిక ఎస్‌ఐ ఆనంద్ గౌడ్‌ను ఏసీబీ అధికారులు ట్రాప్‌చేసి సోమవారం పట్టుకున్నారు. ఏసీబీ డీఎస్పీ సుదర్శన్‌తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌కు చెందిన పూల గంగాధర్ టిప్పర్ ఈ నెల 29న ఇసుకను తరలిస్తూ పట్టుబడింది. ఈ టిప్పర్‌ను విడిచిపెట్టడానికి ఎస్‌ఐ ఆనంద్ గౌడ్ రూ.50వేలు డిమాండ్ చేయగా రూ.20వేలకు ఒప్పందం కుదిరింది. ఈ కేసులో గంగాధర్ ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. సోమవారం మధ్యవర్తి మస్తాన్ అనే వ్యక్తి హవేళిఘణాపూర్ పెట్రోల్ బంక్ వద్దకు వచ్చి డబ్బులు తీసుకెళ్లి ఎస్‌ఐకు ఇవ్వగా పట్టుకొని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఏసీబీ సిబ్బంది రమేశ్, వేణు పాల్గొన్నారు.

కుల వివక్షతపై సీఎం స్పందించాలి

నారాయణఖేడ్: పోలీసు శాఖలో కుల వివక్షతపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించాలని బీఆర్ అంబేడ్కర్ జాతీయ అవార్డు గ్రహీత, కేవీపీఎస్ జిల్లా మాజీ ఉపాధ్యక్షులు కొటారి నర్సింహులు కోరారు. సోమవారం నారాయణఖేడ్ అంబేడ్కర్ భవన్‌లో కుల వివక్షతో ఆత్మహత్యకు పాల్పడిన అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీరాముల శ్రీనివాస్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌ఐ ఆత్మహత్య ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని ఎస్‌ఐ కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. ఇకముందు ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సామాజిక ఉద్యమ కారులు గణపతి, సతీష్, పోచయ్య, మహేందర్, రాజు, శంకర్, దేవీసింగ్, సంగమేశ్వర్, పరశురాం, రమేష్, గౌతం తదితరులు పాల్గొన్నారు.



నారాయణఖేడ్: నివాళులు అర్పిస్తున్న సామాజిక ఉద్యమకారులు

అరుణాచలానికి ప్రత్యేక బస్సులు



నారాయణఖేడ్/పటాన్‌చెరు టౌన్/సంగారెడ్డి టౌన్: ఈ నెల 21వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా నారాయణఖేడ్ నుంచి తమిళనాడులోని అరుణాచలానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సు సౌకర్యం కల్పించనున్నట్లు డిపో మేనేజర్ మల్లేశయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 19న సాయంత్రం 4గంటలకు నారాయణఖేడ్ నుంచి బయలుదేరి 20న కాణిపాకం, వేలూరు గోల్డెన్ టెంపుల్ మీదుగా అదేరోజు సాయంత్రం అరుణాచలానికి బస్సు చేరుకుంటుందని తెలిపారు. 21న గిరి ప్రదక్షిణ, దర్శనం చేసుకొని సాయంత్రం 4గంటలకు జోగుళాంబ శక్తిపీఠాన్ని దర్శనం ఉంటుందని, 22న నారాయణఖేడ్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. బస్సు చార్జీలు రానుపోను ఒక్కొక్కరికి రూ.4,300 ఉంటాయన్నారు. భక్తులు ముందుగానే టీఎస్ ఆర్టీసీ రిజర్వేషన్ల వద్ద టికెట్లు బుకింగ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 9441071134, 9959223170, 9704885694, 96766 67703 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

భెల్ నుంచి

పటాన్‌చెరు భెల్ ఆర్టీసీ డిపో నుంచి సాయంత్రం 6గంటలకు బస్సు బయలుదేరుతుందని డిపో మేనేజర్ సుధాకర్‌రావు తెలిపారు. టూర్ ప్యాకేజీకి సంబంధించిన పూర్తి వివరాలకు 9959226149, 76590 29882 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సంగారెడ్డి నుంచి..

సంగారెడ్డి డిపో నుంచి సాయంత్రం 6గంటలకు సంగారెడ్డి నుంచి అరుణాచలం వయా హైదరాబాద్ నుంచి బస్సు అరుణాచలం బయలుదేరుతుందని డిపో మేనేజర్ ఉపేందర్ తెలిపారు. ఒక్కొక్కరికి టూర్ ప్యాకేజీ రూ.4,100 ఉంటుందని, పూర్తి వివరాలకు 99592 26267, 73828 31381 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'కారుణ్య'పై కరుణ చూపండి

మెదక్ కలెక్టరేట్: కారుణ్య నియామకాలపై కరుణ చూపి తమను ఆదుకోవాలని వీఆర్‌ఏల వారసులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జిల్లాలోని వీఆర్‌ఏ వారసులు తాము యేళ్ల తరబడి తిరుగుతున్నా న్యాయం జరుగడం లేదంటూ కలెక్టర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 230మంది 61యేళ్లు దాటిన వీఆర్‌ఏల వారసులం ఉన్నామన్నారు. తెలంగాణ ప్రభుత్వం వీఆర్‌ఏ వ్యవస్థను రద్దుచేసి కొందరిని ఇతర శాఖలకు బదిలీ చేయగా తమకు కూడా అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చినా అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 21మండలాలకు చెందిన బాధితులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సర్వం సిద్ధం

35 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యం
- ప్రతి గ్రామపంచాయతీ పరిధిలో 2,700
- మండలంలో 50 ఎకరాల్లో పండ్ల తోటలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం

సంగారెడ్డి టౌన్ : జిల్లాలో పచ్చదనం పెంచడమే లక్ష్యంగా వనమహోత్సవ నిర్వహణకు జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. జిల్లావ్యాప్తంగా 639 నర్సరీలలో ఉన్న మొక్కలను అందుబాటులో ఉంచారు. ప్రతి గ్రామపంచాయతీలో 2,700 మొక్కలు నాటాలని భావిస్తున్నారు. అందుకు తగిన ఏర్పాట్లను చేస్తున్నారు. ఆ మేరకు ఉపాధి హామీ కూలీలతో గుంతలు తవ్విస్తున్నారు. ఇప్పటికే పల్లెలు, పట్టణాలలో 8 లక్షల గుంతలు సిద్ధం చేశారు. 20 రకాల మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేశారు. జామ, చింత, మర్రి గన్నేరు, మామిడి, అల్లనేరేడు తదితర మొక్కలను నాటేందుకు ఏర్పాట్లు చేశారు. ఈనెలాఖరులోపు కార్యక్రమం ప్రారంభంకానుంది.

లక్ష్యం ఇదే..

జిల్లా వ్యాప్తంగా 35 లక్షల మొక్కలు నాటడమే లక్ష్యంగా అధికారులు ముందుకు సాగుతున్నారు. జిల్లాలోని పంచాయతీల వారీగా ప్రభుత్వ భూములు ఖాళీగా ఉండకుండా వాటిని నాటేలా పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలిచ్చారు. అలాగే ప్రతి మండలానికి 50 ఎకరాలు చొప్పున పండ్ల తోటల పెంపకం చేపట్టనున్నారు. 5 ఎకరాల కంటే తక్కువ ఉన్న చిన్న, సన్న కారు రైతులకు తోటల పెంపకానికి ప్రోత్సాహాన్ని అందజేయనున్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు

వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాడటం, వాటి సంరక్షణకు జియో ట్యాగింగ్ కూడా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. వాటికి అనువైన స్థలాన్ని, ప్రభుత్వ స్థలాల్లో రోడ్లకు ఇరువైపులా, చెరువులు, కాలువల కట్టలపైన పెద్ద ఎత్తున మొక్కలు నాటనున్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో ఇంటింటికీ పూల, పండ్ల మొక్కలను అందజేయనున్నారు. నాటిన మొక్కలను రోజువారీగా నివేదికలు సమర్పించడంతో పాటు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నారు. దీనిపై ఇప్పటికే అధికారులకు ఆదేశాలిచ్చారు.



మొక్కలు నాటడానికి గుంతలు తవ్వుతున్న ఉపాధి కూలీలు

అందరి సహకారం తీసుకుంటాం



జిల్లాలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ సహకరించాలి. జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రతి ఒక్కరితో మొక్కలు నాటించి వాటిని కాపాడేలా చర్యలు తీసుకుంటాం. ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం అందరి సహకారంతో విజయవంతం చేస్తాం.

– మణికుమార్, జిల్లా ప్లాంటేషన్ మేనేజర్

క్లుప్తంగా

ఒలంపియాడ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులు

సిద్దిపేటజోన్: గతేడాది డిసెంబర్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఇండియన్ ఒలంపియాడ్ పోటీల్లో సిద్దిపేట అంబిటస్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మూడు రాష్ట్ర స్థాయి ర్యాంక్‌లు, ఆరు ఎక్సలెన్స్ అవార్డులతో మొత్తంగా 50 మంది విద్యార్థులు మెడల్స్ సాధించారు. పాఠశాల నుంచి 232 మంది హాజరు కాగా వీరిలో 158 మంది రెండో రౌండ్‌కు ఎంపిక అయ్యారు. నీరజ్, రక్షిత, సూర్య ప్రకాశ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ర్యాంక్‌లు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన అంబిటస్‌కు గోల్డెన్ స్కూల్ అవార్డు లభించింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ప్రిన్సిపాల్ జ్యోతి విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఖేడ్ విద్యార్థులు ఎంపిక


రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థినులు

నారాయణఖేడ్: నారాయణఖేడ్‌కు చెందిన విద్యార్థినులు ఫుట్‌బాల్ పోటీల్లో గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఉమ్మడి మెదక్ జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్‌లోని ఇందిరాగాంధీ స్టేడియంలో సోమవారం ఉమ్మడి జిల్లా స్థాయి సబ్ జూనియర్ బాలికల విభాగం ఫుట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఖేడ్‌కు చెందిన ఈ– తక్షిల పాఠశాలకు చెందిన సారిక, సాయిస్ఫూర్తి, రాగప్రియ, కృష్ణవేణి ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 12 నుంచి 14వ తేదీ వరకు కల్వకుర్తిలో రాష్ట్రస్థాయి పోటీలు జరగనున్నాయి. విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ శరత్ కుమార్, పీఈటీ శ్రీనాథ్ అభినందించారు.

తల్లి విధుల్లో కూతురు

అంగన్‌వాడీ టీచర్‌గా పదేళ్ల బాలిక


విధులు నిర్వహిస్తున్న బాలిక

అల్లాదుర్గం(మెదక్): పదేళ్లకే ఉద్యోగం అంటే విచిత్రమే. ఓ అంగన్‌వాడీ కేంద్రంలో పదేళ్ల బాలిక అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహించింది. ఈ సంఘటన అల్లాదుర్గం మండలం సీతానగర్ తండాలో కనిపించింది. వివరాల్లోకి వెళ్తే.. సీతానగర్ తండాలోని అంగన్‌వాడీ కేంద్రానికి సాక్షి వెళ్లగా అక్కడ పదేళ్ల బాలిక విధులు నిర్వహిస్తూ కంటబడింది. ఈ విషయంపై ఆరా తీయగా, అంగన్‌వాడీ టీచర్ కేంద్రం తెరిచి ఇంటికి వెళ్లింది. వ్యవసాయ పనులు ఉండటంతో టీచర్ కూతురును కేంద్రానికి పంపింది. దీంతో బాలిక అంగన్‌వాడీ టీచర్‌గా విధులు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రంలో నలుగురు చిన్నారులు మాత్రమే ఉన్నారు.

చదువులో మేటి..

అందింది ట్రిపుల్ ఐటీ

- బాసర ట్రిపుల్ ఐటీకి 12 మంది విద్యార్థులు
- ఒకే పాఠశాల నుంచి ఎంపిక
- పదిలోనూ వరుస శత శాతాలు
- ఆదర్శంగా నిలుస్తున్న కుకునూరుపల్లి హైస్కూల్


కుకునూరుపల్లి హైస్కూల్ భవనం

కొండపాక(గజ్వేల్): ప్రతిభకకు పేదరికం, కుటుంబంలోని కష్టాలు అడ్డురావని నిరూపించారు కుకునూరు పల్లి హైస్కూల్ విద్యార్థులు. ఒకే పాఠశాల నుంచి ఏకంగా 12 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు సాధించి ఔరా అనిపించారు. ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో కష్టపడి చదివి, ఇంజనీరింగ్‌లో రాణించేందుకు బంగారు భవిష్యత్ బాటు వేసుకున్నారు.

కుకునూరుపల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్లో 12 మంది విద్యార్థులు బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకొని హైస్కూల్ పేరు ఆదర్శంగా నిలిచారు. 2017–18 సంవత్సరం నుంచి 2023–24 వరకు 10వ తరగతిలో 4 సార్లు 100 శాతం ఉత్తీర్ణతను సాధిస్తూ వస్తున్నారు. 1983 సంవత్సరంలో 10వ తరగతిగా ఏర్పడింది. మండలంలో అత్యధిక విద్యార్థులున్న పాఠశాలగా పేరును నమోదు చేసుకుంటున్న తీరుగా పదిలో మంచి ఉత్తీర్ణతను సాధిస్తూ పేరు ప్రఖ్యాతులు రాణించేలా తాజా మాజీ సర్పంచ్ పొల్కంపల్లి జయంతి, భర్త నరేందర్ సొంత ఖర్చులతో మౌలిక వసతులు కల్పించారు. పాఠశాల భవనం రూపు రేఖలు పూర్తిగా మార్చేశారు. ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొనేందుకు మొక్కలు నాటుతూ ఒక్కొక్క మొక్క ఒక్కొక్క విద్యార్థికి దత్తత ఇచ్చారు. విద్యాపరంగా లోటుపాట్లు ఉండకుండా చూసుకుంటూ వచ్చారు. ప్రస్తుతం హైస్కూల్లో 398 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వరుస రెండేళ్లుగా 100 శాతం ఉత్తీర్ణతను సాధిస్తూ వస్తుంది. 2023–24 సంవత్సరంలో 70 మంది విద్యార్థులు 10వ తరగతిలో పరీక్షలు రాయగా 70 మంది పాసై 100 శాతం ఉత్తీర్ణతను దక్కించుకున్నారు. వీరిలో 12 మంది విద్యార్థులు నిజామాబాద్ జిల్లాలోని బాసరలోని ట్రిపుల్ ఐటీలో సీట్లను దక్కించుకున్నారు. ఒకేసారి 12 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో చోటు దక్కించుకోవడం పట్ల గ్రామస్తులు ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో..



ప్రతీ రోజు 10వ తరగతిలో 10 జీపీఏ రావడానికి ఉపాధ్యాయులు చాలా ప్రోత్సాహం అందించారు. దీన్ని లక్ష్యంగా చేసుకొని ముందుకు పోయాను. ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసేవారు. ట్రిపుల్ ఐటీలో సీటు దక్కడం సంతోషంగా ఉంది.

– స్రవంతి, ట్రిపుల్ ఐటీ విద్యార్థిని

ప్రత్యేక తరగతులు దోహదపడ్డాయి



10వ తరగతిలో 10 జీపీఏను సాధించేందుకు ప్రత్యేక తరగతుల నిర్వహణపై శ్రద్ధ పెట్టాను. అర్థంకాని సబ్జెక్టును అడిగి తెలుసుకున్నాను. దీనికితోడు తల్లిదండ్రులు మరింత ప్రోత్సాహం ఇవ్వడంతో ట్రిపుల్ ఐటీలో సీటు రావడానికి తోడైంది. ప్రత్యేక తరగతులు చాలా దోహదపడ్డాయి. నాతో పాటు ఇంకొంత మంది విద్యార్థులు కూడా ట్రిపుల్ ఐటీకి ఎంపియ్యారు.

– అజయ్, ట్రిపుల్ ఐటీ విద్యార్థి

విద్యతోనే గ్రామాభివృద్ధి



విద్యతోనే గ్రామాభివృద్ధి సాధ్యంగా భావించి పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాం.ప్రభుత్వ నిధులకు ఆశపడకుండా సొంత ఖర్చులతో మోడల్ హైస్కూల్ భవనాన్ని తయారు చేశాం. దీనికి తోడుగా మంచి నీటి వసతి, బాత్ రూంలు, లైబ్రరీని ఏర్పాటు చేశాం.

– పొల్కంపల్లి జయంతి, మాజీ సర్పంచ్

12 మందికి సీట్లు దక్కాయి



10వ తరగతిలో 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు మెరుగైన బోధనలు అందేలా చూశాం. ప్రత్యేక తరగతులకు విద్యార్థులు గైర్హాజరు కాకుండా చర్యలు తీసుకున్నాం. ఉపాధ్యాయుల, తల్లిదండ్రుల, స్థానిక ప్రజా ప్రతినిధుల సహాయ సహకారాలతో 12 మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో చోటు దక్కింది.

– సత్తయ్య, ప్రధానోపాధ్యాయుడు

కళాశాలల కోసం కలిసి పోరాడుదాం

- జిల్లాలో ట్రిపుల్ ఐటీ, మహిళా ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయాలి
- ఐఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు నాగరాజు



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఎస్‌యూ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో ట్రిపుల్ ఐటీ, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు దిశగా ప్రతీ ఒక్కరం కలిసి పోరాడుతామని, ఇండియన్ స్టూడెంట్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు పాపని నాగరాజు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ.. కేవలం బాసరలో మాత్రమే నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీని ఉమ్మడి జిల్లాల్లో కేటాయించి, విద్యార్థులకు లబ్ధి చేకూర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా సిద్దిపేటలో మహిళా ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలన్నారు. దీంతో ఈ ప్రాంత విద్యార్థులకు లబ్ధి చేకూరుతుందన్నారు. ఏపీలో నాలుగు ట్రిపుల్ ఐటీలు ఉన్నాయని, తెలంగాణలో కేవలం ఒక్కటే ఉందని, దీంతో ట్రిపుల్ ఐటీలో చేరాలనుకునే విద్యార్థులకు నిరాశే మిగులుతుందన్నారు. పేద విద్యార్థులకు లబ్ధి చేకూర్చే విధంగా విద్యారంగంలో మార్పులు తీసుకురావాలన్నారు. అన్ని జిల్లాల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థులు నాణ్యత ప్రమాణాలు, సౌకర్యాలు, ప్రతిభావంతులను తయారుచేసే ఇంజనీరింగ్ కాలేజీలు లేకపోవడంతో ప్రైవేట్ రంగం వైపునకు విద్యార్థులు వెలుతున్నారన్నారు. అందుకే గ్రామీణ, పట్టణ, నగర ప్రాంత ప్రజలు ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల వైపు వెళ్లకుండా ప్రభుత్వం ట్రిపుల్ ఐటీలను, ఇంజనీరింగ్ కళాశాలలను విరివిగా ఏర్పాటు చేయాలన్నారు. విద్యారంగానికి బడ్జెట్‌లో సముచిత నిధులు కేటాయించాలన్నారు. పార్టీలు, సంస్థలను పక్కకు పెట్టి, సిద్దిపేటలో ట్రిపుల్ ఐటీ, మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు దిశగా ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్, హరీశ్ గౌడ్, రాకేశ్ పాల్గొన్నారు.

ఎస్‌ఐది కుల దురహంకార హత్య

రాష్ట్ర మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు


మాట్లాడుతున్న శ్రీరాములు

మిరుదొడ్డి(దుబ్బాక): భద్రాద్రి కొత్త గూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్‌ఐ శ్రీరాములు శ్రీను ఆత్మహత్య ముమ్మాటికీ కుల దురహంకార హత్యగా పరిగణిస్తున్నామని, అందుకు కారణమైన సీఐ జితేందర్‌రెడ్డితోపాటు, పోలీస్ సిబ్బందిని విధుల నుంచి తొలగించి కఠినంగా శిక్షించాలని తెలంగాణ రాష్ట్ర మాల మహానాడు పొలిట్ బ్యూరో చైర్మన్ ర్యాకం శ్రీరాములు, ఇంటర్నేషనల్ అంబేడ్కర్ సేవా సమితి రాష్ట్ర ఇన్‌చార్జి భూంపల్లి భీంరావు డిమాండ్ చేశారు. మంగళవారం అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ.. న్యాయాన్ని కాపాడాల్సిన పోలీస్ వ్యవస్థలో కుల వివక్షత నెలకొనడం రాజ్యాంగానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్‌పై అనునిత్యం అవమానిస్తూ, ఇబ్బందులకు గురి చేస్తూనే విధి నిర్వహణలో ఆటంకాలు సృష్టిస్తూ చివరికి ఆత్మహత్యకు పురిగొలిపేలా చేసిన సీఐ, పోలీస్ సిబ్బందిని కఠినంగా శిక్షించాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొని వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగంతో పాటు రూ. కోటి ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో మాల మమానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మండల యాదగిరి, మోతె మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, నాయకులు బోరెం రాజేశ్వర్, లింగం, కన్నయ్య, కనకయ్య, రవి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముళ్ల పొదలు తొలగింపు


ముళ్ల పొదలను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

జోగిపేట(అందోల్): సాక్షి దినపత్రికలో ప్రచురితమైన 'మలుపుల్లో– మృత్యుఘంటికలు' అనే కథనంపై నేషనల్ హైవే అధికారులు స్పందించి అన్నాసాగర్ చెరువు కట్టకు ఇరువైపులా ఉన్న ముళ్ల పొదళ్లను సోమవారం తొలగించారు. నేషనల్ హైవే ప్రాజెక్టు డైరెక్టర్ మధుసూదన్‌రావు ఆదేశాలు మేరకు జేసీబీ సాయంతో పనులు చేపట్టారు. అన్నాసాగర్ పెద్ద చెరువు కట్టకు ఇరువైపులా మలుపుల్లో పెద్ద పెద్దగా ముళ్ల చెట్లు పెరగడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. **ఈ విషయం సాక్షి దినపత్రికలో ప్రచురితం కావడంతో అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు.**

భవనంపై నుంచి పడిపోయిన విద్యార్థిని

- తీవ్ర గాయాలు, విరిగిన కాలు
- గురుకుల పాఠశాలలో ఘటన
- వెనుక నుంచి తనను తోసేసినట్లు చెబుతున్న బాధితురాలు


హాస్టల్ భవనం పైన పరిశీలిస్తున్న సీఐ


గాయపడిన విద్యార్థిని

రాయికోడ్(అందోల్): రెండస్తుల భవనంపై నుంచి ఓ విద్యార్థిని పడిపోవడంతో కాలు విరిగి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సోమవారం రాయికోడ్ మండలం యూసుఫ్‌పూర్‌లో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన మల్లీశ్వరి అల్లాపూర్ శివారులోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. సమ్మర్ హాలిడేస్ అనంతరం అనారోగ్యం కారణంగా జూన్ 22న తిరిగి పాఠశాలకు వచ్చి అక్కడే హాస్టల్‌లో ఉంటోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం హాస్టల్‌లోని మొదటి అంతస్తులోని తన గది నుంచి తోటి విద్యార్థినులతో కలిసి అల్పాహారం కోసం కిందున్న భోజన గదికి వస్తోంది. ఆ సమయంలో తిరిగి పైకి వెళ్లింది. రెండో అంతస్తుకు వెళ్లిన మల్లీశ్వరి అక్కడి నుంచి కిందపడిపోయింది. మరో విద్యార్థిని తోడుగా పైకి రమ్మని చెబితే పైకి వెళ్లానని, తనను వెనుక నుంచి మరో విద్యార్థిని తోసివేయగా కిందపడినట్లు వివరిస్తోంది. తీవ్ర గాయాల పాలై గట్టిగా కేకలు వేయగా పలువురు బాలికల ద్వారా విషయం తెలుసుకున్న టీచర్లు చికిత్స నిమిత్తం జహీరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుడి కాలు విరిగినట్లు, వెన్నుముకకు తీవ్ర గాయమైనట్లు గుర్తించిన డాక్టర్లు మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డికి రిఫర్ చేశారు. సంగారెడ్డిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినికి కాలు విరగడంతోపాటు వెన్నుముకకు శస్త్రచికిత్స అవసరమని డాక్టర్లు తెలిపినట్లు కుటుంబీకులు చెప్పారు. తనను మరో విద్యార్థిని కిందకు తోసేసినట్లు చెప్పగా బాలికలను విచారించగా అలాంటి సమాచారం తమకు రాలేదని ప్రిన్సిపాల్ మాన్విచంద్ వివరించారు. ఘనటపై ఆర్‌సీఓ బీమయ్య, జహీరాబాద్ రూరల్ సీఐ నయిమోద్దీన్, రెవెన్యూ అధికారులు వేర్వేరుగా వివరాలు సేకరించారు. బాధిత విద్యార్థిని తెలిపిన వివరాలపై ఉన్నతాధికారులు లోతుగా విచారిస్తే వాస్తవాలు వెలుగులోకి రానున్నాయి.

వైద్య ఖర్చులు గురుకుల యాజమాన్యం భరించాలి

సంగారెడ్డి టౌన్: రాయికోడ్ గురుకుల పాఠశాలలో చూస్తున్న పదవ తరగతి మల్లేశ్వరి విద్యార్థిని ప్రమాదవశాత్తు భవనం పైనుండి కింద పడిందని సోమవారం సంగారెడ్డి లోని బాలాజీ హాస్పిటల్ కు చికిత్స పొందుతున్న ఆమెకు ఎస్ఎఫ్ఐ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడుతూ చికిత్స పొందుతున్న విద్యార్థి కుటుంబానికి గురుకుల యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలని నిర్లక్ష్యం వహిస్తున్న గురుకుల ప్రిన్సిపాల్‌ని వెంటనే సస్పెండ్ చేయాలన్నారు.

కంకర క్రషర్‌లలో తనిఖీలు


కంకర క్రషర్‌లలో పర్యటిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

జిన్నారం(పటాన్‌చెరు): జిన్నారం మండలంలోని మాదారం, రాళ్ల కత్వ గ్రామాల్లో కంకర క్రషర్లతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండటంతో 'సాక్షి'లో 'అడ్డగోలుగా పేల్చేస్తుండ్రు' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే.దీనిపై స్పందించిన పీసీబీ అధికారులు అజయ్ సిబ్బందితో కలిసి సోమవారం మాదారంలోని కంకర క్రషర్‌లలో తనిఖీలు చేపట్టారు. వాయు కాలుష్యంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజలు అధికారులకు వివరించారు. కంకర క్రషర్‌లపై పూర్తి స్థాయి విచారణ చేపడుతున్నామని, నిబంధనలు పాటించని క్రషర్‌ల యాజమాన్యాలకు నోటీసులు అందిస్తామని అధికారులు తెలిపారు. ఉన్నతాధికారులకు పూర్తి నివేదికలు అందిస్తామన్నారు.

గుట్కా ప్యాకెట్లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న గుట్కా ప్యాకెట్లు

వర్గల్(గజ్వేల్): టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుట్కాప్యాకెట్లు స్వాధీనం చేసుకున్న ఘటన వర్గల్ మండలం గౌరారంలో సోమవారం చోటు చేసుకుంది. సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ జానకీరాంరెడ్డి, గౌరారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గౌరారంలోని డీ.మహేశ్ కుమార్ కిరాణా దుకాణంలో వివిధ రకాల ప్రభుత్వ నిషేధిత గుట్కా ప్యాకెట్లు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ బృందం, గౌరారం పోలీసులు కిరాణ దుకాణంలో తనిఖీలు నిర్వహించారు. రూ.50,000 విలువైన గుట్కా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చోరీల దొంగ అరెస్టు

శివ్వంపేట, తూప్రాన్: పట్టపగలే ఇంట్లో చోరీకి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తూప్రాన్ సీఐ రంగకృష్ణ తెలిపారు. కేసుకు సంబంధించిన వివరాలు సీఐ కార్యాలయంలో వెల్లడించారు. బుధవారం శివ్వంపేట మండల పరిధి సికింద్లాపూర్ గ్రామంలో దొంటికే మహేశ్ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తి చోరీకి పాల్పడ్డాడు. గోమారం వద్ద సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో జీడిమెట్ల ప్రాంతానికి చెందిన కల్లే మహేశ్ అనుమానాస్పద స్థితిలో కనిపించాడు. వెంటనే అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ విషయం వెలుగులోకి వచ్చింది. చోరీ చేసిన 9 తులాల బంగారు ఆభరణాలతోపాటు రూ.1,000 స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కూతురు ప్రేమ వివాహం

మనోవేదనకు గురై తండ్రి ఆత్మహత్య

దుబ్బాకరూరల్: కూతురు ప్రేమ వివాహం చేసుకోవడంతో మనోవేదనకు గురైన తండ్రి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని అచ్చుమాయిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. సోమారపు లింగం(42) ఆదివారం పొలం వద్ద తుకానికి నీళ్లు పెడుతానని వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదు. రాత్రి పొలం వద్దకు వెళ్లి చూడగా చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. కూతురు ప్రేమ వివాహం చేసుకోవడంతో మానసికంగా కుంగిపోయి ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. సోమవారం మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉరి వేసుకొని వ్యక్తి..

దుబ్బాకరూరల్: ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండంలోని ఆకారం గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ గంగరాజ్ కథనం మేరకు.. గ్రామానికి చెందిన భాస్కర్(26) ఆదివారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల, తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించలేదు. సోమవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని చెట్టుకు ఉరి వేసుకొని కనిపించాడు. మృతుకి గల కారణాలు తెలియరాలేదు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..

చిన్నశంకరంపేట(మెదక్): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నార్సింగి మండలం శేరిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. శేరిపల్లి గ్రామానికి చెందిన నాగులగారి(టైలర్) మహేశ్ గౌడ్ (40) సోమవారం సాయంత్రం ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కాలేజీపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతిపత్రం


కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

సిద్దిపేటరూరల్: ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థులు ఆస్పత్రి బారిన పడేలా వ్యవహరించిన సురభి మెడికల్ కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ మాట్లాడుతూ.. లక్షల్లో ఫీజులు తీసుకుంటూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టకుండా సురభి మెడికల్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందన్నారు. కళాశాలలో సరైన వసతులు, అసంపూర్తి నిర్మాణంతో కళాశాలను నిర్వహిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రంజిత్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్, జిల్లా నాయకులు సంతోష్, భరత్ కుమార్, అభినవ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చేపలు పట్టేందుకు వెళ్లి మృత్యువాత

కల్హేర్(నారాయణఖేడ్): చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సిర్గాపూర్ ఎస్ఐ మహిపాల్‌రెడ్డి కథనం మేరకు.. సిర్గాపూర్ మండలం అంతర్‌గాంకు చెందిన తోంటోల్ల సుభాష్ (30) ఆదివారం ఉదయం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఇంటి నుంచి వెళ్లిన సుభాష్ సోమవారం గ్రామ సమీపంలోని తంబల వాగులో శవమై కనిపించాడు. చేపలు పట్టేందుకు వెళ్లి కరెంట్ షాక్‌తో మృతి చెంది ఉంటాడని మృతుడి తండ్రి రాములు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..

అక్కన్నపేట(హుస్నాబాద్): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అక్కన్నపేట మండలం పంతుల్‌తండా గ్రామ పరిధిలోని హేంసింగ్ తండాలో చోటుచే సుకుంది. స్థానికుల కథనం మేరకు.. తండాకు చెందిన భూక్య శివలాల్(50) అనే రైతు వ్యవసాయ బావి వద్ద స్టార్టర్‌లో పనులు చేస్తుండగా ఒక్కసారిగా కరెంట్ షాక్ కొట్టి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య దేవి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. శివలాల్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామ మాజీ సర్పంచ్ భూక్య అశ్వినిహేము, బీజేపీ పార్టీ గిరిజన మోర్చా నాయకులు రైనా నాయక్, కాంగ్రెస్ గిరిజన సెల్ మండలాధ్యక్షుడు కరంటోతు రవి, తండావాసులు, యువకులు కోరుతున్నారు.

వాహనం అదుపుతప్పి పడిపోవడంతో..

మిరుదొడ్డి(దుబ్బాక): టీవీఎస్ ఎక్సెల్ అదుపుతప్పి కిందపడటంతో వ్యక్తి మృతి చెందిన ఘటన అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. భూంపల్లి ఎస్ఐ హరీశ్‌గౌడ్ కథనం మేరకు.. మండల పరిధిలోని పోతారెడ్డి పేటకు చెందిన ఎర్రోల్ల కిష్టయ్య (45) డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం మండల పరిధిలోని రుద్రారంలో ఉంటున్న బంధువుల వద్దకు టీవీఎస్ ఎక్సెల్ పై వెళ్లాడు. మధ్యాహ్నం తిరిగి పోతారెడ్డి పేటకు వస్తున్న క్రమంలో అక్బర్‌పేట సమీపంలో బండి అదుపుతప్పి పడిపోయింది. ఈ ప్రమాదంలో కిష్టయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.